ప్రజాశక్తి



తాగునీరు వృథా...



పాడైన ఉద్దానం మంచినీటి కుళాయి

ప్రజాశక్తి- కవిటి

మండలం కపాసుకుద్ది గ్రామంలో ఉద్దానం మంచినీటి పథకం పైప్‌లైన్ పాడవ్వడంతో తాగునీరు వృథాగా పోతోంది. గ్రామంలోని కొత్త వీధిలో బడే గోవిందమ్మ ఇంటి ఎదురుగా ఉన్న ఉద్దానం తాగునీరు కుళాయి 20 రోజుల క్రితమే పాడైంది. స్థానికులు ఉద్దానం మంచినీటి పథకం సిబ్బందికి విషయం తెలియచేసినా ఇంతవరకు స్పందించలేదు. దీంతో స్థానికులు దానిని మరమ్మతు చేసే ప్రయత్నం చేసినా నీటిధార ఆగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత సిబ్బంది స్పందించి పాడైన కుళాయిని బాగుచేసి మంచినీరు వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.



దసరా బోనస్ విడుదల చేయాలి

పోస్టల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని సంస్థల ఉద్యోగులకు బోనస్ ప్రకటించి, పోస్టల్ ఉద్యోగులను విస్మరించడాన్ని నిరసిస్తూ పోస్టల్ ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సయమంలో పోస్టల్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే బోనస్ ప్రకటించాలని, పోస్టల్ ఉద్యోగులపై అనుసరిస్తున్న పక్షపాత వైఖరిని విడనాడాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌పిఇ జిల్లా కన్వీనర్ కె.గణపతిరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2020 నుంచి దసరా ముందు బోనస్ ఇవ్వకుండా పోస్టల్ ఉద్యోగులను వేధిస్తోందని విమర్శించారు. పోస్టుమేన్ సంఘం నాయకులు బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలను మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సైతం అందజేస్తున్న పోస్టల్ ఉద్యోగులపై కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమన్నారు. రైల్వే, ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దసరా పండగకు వారం ముందే బోనస్ ప్రకటించిన ప్రభుత్వం, పోస్టల్ ఉద్యోగులకు ప్రకటించకపోవడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిడిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు గురన్న, పోస్టల్ సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, యు.వి రమణ, రమేష్, పాత్రో, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరందించాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు



వంశధార డిఇతో ఫోన్‌లో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

వర్షాభావ పరిస్థితులు, వంశధార కాలువల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు అందకపోవడంతో వరి సాగుకు నష్టం వాటిల్లుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి టిడిపి కార్యాలయంలో అచ్చెన్నాయుడును నియోజకవర్గంలోని రైతులు బుధవారం కలిసి వంశధార కాలువలు, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరందించడం లేదని తెలిపారు. దీంతో వరి పంట వెన్ను దశలోనే ఎండిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆయన వెంటనే వంశధార డిఇ, విద్యుత్ శాఖ డిఇకు ఫోన్ చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ వంశధార కాలువ ద్వారా సాగునీరు అందించడం ఆపకూడదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగునీరు ఆగితే రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. వరి నాటిన తర్వాత వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండిపోయి పూర్తిగా పాడైపోయాయని, తమకు పంట నష్టం అందించేలా చూడాలని రైతులు అచ్చెన్నాయుడును కోరారు. వ్యవసాయ అధికారులకు పంట పొలాలు చూపించి పంట నష్ట పరిహారం అడగాలని, ఈ ప్రభుత్వం అందించకపోతే టిడిపి ప్రభుత్వం వచ్చాక అందిస్తామని హామీనిచ్చారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- కాలువల మరమ్మతులు చేపట్టి శివారు భూములకు నీరు ఇవ్వాలి
- రెండో పంటకు ఉచితంగా విత్తనాలు ఇవ్వాలి
- అన్నిరకాల రుణాలు రద్దు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఏడాది వర్షాల్లేక, కాలువల ద్వారా నీరందక జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడంతో, కాలువలు బలహీనంగా ఉండడం వల్ల శివారు భూములకు నీరందడం లేదని తెలిపారు. వంశధార, నాగావళి నదుల్లో నీళ్లు ఉన్నా, నీటి వినియోగంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి, రైతుల పంటలకు నీరు ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. వంశధార నదిలో 52.5 టిఎంసిల నీరు మన వాటా లభ్యమవుతున్నా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా 17 టిఎంసిలకు మించి నీరు వినియోగించడం లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వంశధార కాలువలకు మరమ్మతులు చేయాలని, షట్టర్లను బిగించాలని గతంలో పలుమార్లు రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులపై పాలకుల నిర్లక్ష్యం జిల్లాకు శాపంగా మారిందన్నారు.

ఎడమ కాలువ ద్వారా 1.48 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా, అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి కరువు వల్ల తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యామ్నాయంగా రెండో పంటకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని, అన్నిరకాల రుణాలను రద్దు చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాలువల మరమ్మతులు చేసి శివారు భూముల వరకు నీరు ఇవ్వాలని, ఎత్తిపోతల పథకాల మరమ్మతులు చేయాలని, ఉపాధి హామీ ద్వారా 200 రోజుల పనులు కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, పంటల బీమా రైతులందరికీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేడు సామాజిక సాధికార బస్సు యాత్ర



సూచనలు చేస్తున్న సాయిరాజ్, కృష్ణదాస్

- యాత్రకు సర్వం సిద్ధం
- భారీస్థాయిలో జన సేకరణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించబోతున్న సామాజిక సాధికార బస్సుయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో ఒకేసారి ఈనెల 26న బస్సుయాత్ర ప్రారంభం కాబోతుండగా, అందులో ఒకటి ఇచ్ఛాపురం నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఇచ్ఛాపురం పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. తొలి విడతలో ఈ యాత్ర జిల్లాలో 26న ఇచ్ఛాపురం, 31న ఆమదాలవలస, నవంబరు మూడో తేదీన నరసన్నపేటలో చేపట్టనున్నారు. నాలుగున్నరేళ్లలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి యాత్రలో వివరించనున్నారు.

ఈ యాత్రకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను వైసిపి నాయకులు పూర్తి చేశారు. యాత్ర పర్యవేక్షణ పరిశీలకులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు విస్తృత సమావేశాలు నిర్వహించి జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగ సభకు 25వేల మందికి తక్కువ కాకుండా జన సేకరణ ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ యాత్ర ఏర్పాట్లపై నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. యాత్ర విజయవంతానికి దిశానిర్దేశం చేశారు. అనంతరం సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి, షర్మిళ, జగన్మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రలు ఇచ్ఛాపురంతో ముగిశాయని, బస్సు యాత్ర ఇక్కడ్నుంచే ప్రారంభమవుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి, సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైసిపి పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం అర్బన్ : ఇచ్ఛాపురం నుంచి చేపడుతున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు కె.రవిబాబు, కంబాల జోగులు కోరారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజిక సాధికార యాత్రలో వైసిపి నాయకులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. అన్ని నియోజకవర్గాల్లో దశలవారీగా యాత్ర చేపడతామని చెప్పారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఐదుగురు బిసిలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ఇచ్చారని చెప్పారు. 56 కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి బిసిలకు అత్యంత ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. అన్ని ప్రధాన పదవులు వెనుకబడిన తరగతుల వారికి కేటాయించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం జగన్ ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలబడి గెలిపించాలని కోరారు. సమావేశంలో పలు కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, పేరాడ తిలక్, ఎం.ఎ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

తగాదా తీర్చేందుకు వెళ్లిన వృద్ధుడు హత్య

ప్రజాశక్తి - పలాస



మృతి చెందిన సయ్యద్ ఖాదర్

తగాదా తీర్చేందుకు వెళ్లిన వృద్ధుని తలపై చెంబుతో దాడి చేయడంతో మృతి చెందిన ఘటన పలాసలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనలో మండలంలోని సూదికొండకు చెందిన సయ్యద్ ఖాదర్ (65) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం హిరమండలానికి చెందిన సయ్యద్ ఖాదర్ పలాస మండలంలోని సూదికొండకు చెందిన షేక్‌దాస్‌తో కలిసి టైల్స్ పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట సయ్యద్ ఖాదర్, షేక్‌దాస్ మద్యం సేవించారు. ఆ సందర్భంలో షేక్‌దాస్‌కు సయ్యద్ ఖాదర్ రూ.50 బకాయి పడి ఉన్నాడు. తన బాకీ డబ్బులు ఇవ్వాలని మంగళవారం రాత్రి సయ్యద్ ఖాదర్‌ను షేక్‌దాస్ అడగడంతో గొడవ ప్రారంభమైంది.

వారిద్దరూ కొట్టుకుంటున్న సమయంలో సూదికొండకు చెందిన వృద్ధుడు సయ్యద్ ఖాదర్ విడదీసేందుకు వెళ్లాడు. చెంబుతో బలంగా వృద్ధుని తలపై కొట్టడంతో ఆయన మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కాశీబుగ్గ ఎస్ఐ ఖాదర్ కేసు నమోదు చేశారు.

పిఎంజెఎవై కార్డుల జారీపై అవగాహన

ఎచ్చెర్ల : జాతీయ ఆరోగ్య సంస్థ (ఎన్‌హెచ్ఎ) అమలు చేస్తున్న ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకం కార్డుల జారీకి క్షేత్రస్థాయి సిబ్బంది శతశాతం వివరాలు నమోదు చేయాలని ఎన్‌హెచ్ఎ సీనియర్ కన్సల్టెంట్ వీర్‌భారతి అన్నారు. ఎచ్చెర్ల ప్రాథమిక ఆర్యోగ్య కేంద్రం పరిధిలోని ఎస్-ఎస్ఆర్ పురంలో కార్డు జారీ విధానాన్ని బుధవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. యాప్‌లో నమోదైన వివరాలతోనే కార్డు జనరేట్ చేసుకునే వీలు కల్పించినట్లు తెలిపారు. లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలు నేరుగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటరు పి.ప్రకాశరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





బాధ్యతలు స్వీకరిస్తున్న భరత్ నాయక్

ఆర్‌డిఒ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పలాస, శ్రీకాకుళం అర్బన్

పలాస రెవెన్యూ డివిజన్ అధికారి ఎస్.భరత్ నాయక్ ఆర్‌డిఒ కార్యాలయంలోని తన ఛాంబరులో బుధవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు, ఆర్‌డిఒ ఎఒ పి.బాల, డిటి లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు పి.వెంకటేశ్వరరావు, సునంద, కరుణ తదితరులు పాల్గొన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న భరత్ నాయక్

ప్రజారోగ్యానికే ఆరోగ్య సురక్ష

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ప్రజలను ఆరోగ్యవంతులని చేయడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఇంటి వద్దకు వచ్చిన వైద్య సిబ్బందికి సహకరించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. నగరంలోని పుణ్యపువీధి యుపిహెచ్‌సి ఆధ్వర్యాన ఏడు రోడ్ల కూడలిలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఆరోగ్య శిబిరానికి వచ్చిన ఒపి, ల్యాబ్ పరీక్షలు, మందులు ఇచ్చే విధానం, సిబ్బంది పనితీరు, స్పెషలిస్ట్ డాక్టర్ల హాజరును పరిశీలించారు. బిపి, షుగర్, గుండె సంబంధిత, ఇతర వ్యాధులు ఎంతమందికి ఉన్నాయనే విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక శిబిరాలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను స్పెషలిస్టు వైద్యులతో గుర్తించి, వారికి చికిత్స అందించనున్నట్లు తెలిపారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల నివేదికల ఆధారంగా వారికి చికిత్స అందించడమే కాకుండా ఇంకా ఏవైనా వ్యాధులు ఉంటే మెరుగైన వైద్యం కోసం సత్వర చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో వినూత్న మార్పులు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - గార

రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో వినూత్న మార్పులతో ప్రజలకు మేలు చేకూరిందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలోని దువ్వపేటలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనంతో పాటు రూ.17.5 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను బుధవారం ప్రారంభించారు. అనంతరం అక్కడే నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని రోగుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనా వికేంద్రీకరణలో భాగంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో ప్రభుత్వ పాలనను తీసుకొచ్చామన్నారు. ప్రజలు మండల కార్యాలయాలు, పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా సొంత ఊర్లోనే పనులు చక్కదిద్దుకునేందుకు వీలు కల్పించామన్నారు. ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నామని, ఇంటివద్దకే వైద్యులు వచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. ఇంతకంటే పాలనలో ఇంకేం మార్పులు తీసుకురాగలమని ప్రశ్నించారు. ప్రజలు ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి గొండు రఘురాం, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ గోరు అనిత, వైసిపి నాయకులు బరాటం నాగేశ్వరరావు, పీస గోపి, కొయ్యాన నాగభూషణ, ముంజేటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.





సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాము

దారికాచి... దోచుకున్నారు

మహిళను అడ్డగించి బంగారు ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి - కవిటి

తన కుమారుడిని పాఠశాలలో దిగబెట్టి స్కూటీపై ఇంటికి వస్తున్న మహిళ వద్ద బంగారు ఆభరణాలను దుండగులు దారికాచి బుధవారం దోచుకున్నారు. మండలంలోని బింగుపుట్టుగకు చెందిన బింగి లత తన కుమారుడ్ని స్కూటీపై పలాసలోని సత్యసాయి పాఠశాలకు దిగబెట్టింది. తిరిగి ఇంటికి వస్తుండగా బింగుపుట్టుగ మార్గంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అడ్డగించారు. దీంతో ఆందోళన చెందిన లత బండిపై నుంచి కింద పడిపోవడంతో ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు, స్కూటీలో ఉన్న చేతి బ్యాగును లాక్కున్న దొంగలు జాతీయ రహదారి వైపు వెళ్ళిపోయారు. లత బ్యాగులో రెండు ఎటిఎం కార్డులు, రూ.రెండు వేల నగదు, సెల్‌ఫోన్ ఉంది. లత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రాము పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

28న మహర్షి వాల్మీకి జయంతి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మహర్షి వాల్మీకి జయంతిని ఈనెల 28న ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బిసి, బోయ వాల్మీకి నాయకులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.


స్పీకర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ పరిధిలో దాదాపు 1200 మంది పెన్షనర్ల కార్యకలాపాల నిమిత్తం కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం స్పీకర్ తమ్మినేని సీతారాంకు పెన్షనర్ల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. స్పీకర్ సానుకూలంగా స్పందిస్తూ పెన్షనర్ల న్యాయమైన కోరికను తప్పక నెరవేరుస్తానని, కచ్చితంగా స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారని పెన్షనర్ల సంఘం నాయకులు తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఎస్.గణపతిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. తహశీల్దార్ కూడా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొడ్డేపల్లి మోహనరావు, సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు, హెచ్‌వి సత్యనారాయణ, రాజాన సత్యనారాయణ, కూర్మాన షణ్ముఖరావు, బి.సూర్యనారాయణ, బెండి నారాయణరావు, కె.జనార్దనరావు, సంజీవరావు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగన్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఇచ్ఛాపురంలో వైసిపి బస్సు యాత్రను గురువారం విజయవంతం చేయాలని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి కోరారు. బుధవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలపై వివరించడానికి ఉత్తరాంధ్ర మంత్రులు బస్సుయాత్రను ఇచ్ఛాపురంలో ప్రారంభిస్తున్నారని, ఈ యాత్రకు ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, గురువారం ఉదయం 9 గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

అచ్చెన్నను కలిసిన గోవిందరాజులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును బుధవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి, కళింగ వైశ్య సాధికారిత కన్వీనర్ బోయిన గోవిందరాజులు తన కుటుంబ సభ్యులతో కలిసి టిడిపి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు గోవిందరాజుల కుటుంబసభ్యులతో కాసేపు ముచ్చటించారు. అలాగే జిల్లాలో టిడిపి పరిస్థితి తదితర అంశాలను గోవిందరాజులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేసి పార్టీని అధికారంలోకి రావడానికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని గోవిందరాజులకు కోరారు. ఈ కార్యక్రమంలో గోవిందరాజులు సతీమణి, కోటబొమ్మాళి మాజీ సర్పంచ్ బోయిన శారదగోవిందరాజులు, కుమారుడు బోయిన సత్య శ్రీనివాస్ ఉన్నారు.

జెఎన్‌టియు పాలక మండలి సభ్యునిగా రాజేష్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్


రాజేష్

జెఎన్‌టియు విజయనగరం పాలకమండలి సభ్యునిగా ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బుడుమూరు రాజేష్‌ను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాకు చెందిన ఆయన గతంలో అంబేద్కర్ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యునిగా కూడా పనిచేశారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. కళాశాలల అభివృద్ధికి తనవంతు సూచనలు, సలహాలు అందిస్తానని రాజేష్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పోలాకి

గీత కార్మికుల ఐక్యత హక్కుల సాధన కోసం ఏర్పాటు చేయబోయే మహాసభను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోట అప్పారావు, దుబ్బ కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం రూరల్ పరిధిలో ఒప్పంగి ప్రాంతంలో ఈనెల 27 శుక్రవారం జరగబోయే గీత కార్మికుల మహాసభను విజయవంతం చేయాలని కోరారు. గీత కార్మికుల వృత్తి, భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకానికి అర్హత లేకుండా చేయడంతో సంఘం తీవ్ర ఆవేదన చెందినట్లు తెలిపారు. జరగబోయే మహాసభకు రాష్ట్ర నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు జిల్లాలో అన్ని సొసైటీల పరిధిలోగల గీత కార్మికులు హాజరు కావాలని కోరారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: నేడు మంచినీటి సరఫరాకు అంతరాయం కలగనుందని మున్సిపల్ కమిషనర్ ఎం. రవి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస పంపు హౌస్‌లో నీటి సరఫరా చేయు మోటర్లు బుధవారం కాలిపోవడంతో గురువారం మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. పురపాలక సంఘ పరిధిలోని కుదిరాం, లక్ష్ముడుపేట, వెంకయ్య పేట, రావికంటి పేట ప్రజలకు మంచి నీటి సరఫరా చేయబడదని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో మున్సిపాలిటీ వాటర్ ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయ బడునని తెలిపారు. అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు.


నగదును అందిస్తున్న ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్

కడియాల ప్రకాష్ ఉదారత

ప్రజాశక్తి- కవిటి

నలుగురితో కలిసిపోతూ, అన్నా అంటే నేనున్నా అంటూ ఎంతోమందికి ఆపన్న హస్తం అందిస్తూ వస్తున్న కవిటి ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సచివాలయాలు, ఆర్‌బికెల నిర్మాణం కోసం అవసరమైన స్థలం కొనుగోలు నిమిత్తం ప్రకాష్ ఆర్థిక సాయం అందించి సహచర నాయకులకు ఆదర్శంగా నిలిచారు. మండలం సహలాలపుట్టుగ పంచాయితీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేకపోవడంతో భవనాలు నిర్మాణం కోసం స్థలం కొనుగోలు చేయాల్సి వచ్చింది. దీంతో స్థానిక ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ స్థలం కోసం తన వంతుగా రూ.25వేలను బుధవారం గ్రామ పెద్దలకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి తిలక్, ఎన్ని అశోక్, నీలయ్య, దట్టి అజయ్, సర్పంచ్ ప్రతినిధి రవి, ఎంపిటిసి ప్రతినిధి మురళి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా వైకుంఠరావు

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా దుంపల వైకుంఠరావు నూతనంగా నియమితులైన సందర్భంగా బుధవారం అధ్యాపక బృందం ఆహ్వానించారు. ఇప్పటి వరకు కళాశాల, స్కూల్ అభివృద్ధికి కారణమైన గెద్దాడ శివ ప్రసాద్‌ను నూతన ప్రిన్సిపాల్, స్కూలు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పేరెంట్ కమిటీ చైర్మన్ అశోక్ కుమార్, వైస్ చైర్మన్ మోహనరావు, గుణవతి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం


మెళియాపుట్టి : వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జలుమూరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని పట్టుపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అనారోగ్యంతో బాధపడే వారికి కావాల్సిన పరీక్షలు, మందులు అందించడంతో పాటు ఆపరేషన్లు చేయాల్సి వస్తే అందుకు తగిన సహకారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా ఇటువంటి కార్యక్రమం జరగడం లేదని ఒక ఆంధ్రప్రదేశ్ లోనే జరుగుతుందన్నారు. అనంతరం ఐసిడిఎస్ ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాళ్లను తిలకించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజిని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎం.పద్మనాభం, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, మండల వైసిపి కన్వీనర్ పల్లి యోగి, స్థానిక సర్పంచ్ ఎస్.లక్ష్మి, వైద్యాధికారులు హేమంత లక్ష్మి, పావని, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని కరవంజ ఆదర్శ పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణదాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, కర్వంజా సర్పంచ్ జుత్తు నేతాజీ, వైసిపి నాయకులు పైడి విఠల్‌రావు, జలుమూరు పిహెచ్‌సి వైద్యాధికారి తాడేల శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: నందిగాంలో సర్పంచ్, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ రమణమ్మ, జయరాం ఆధ్వర్యంలో నిర్వహించిన జనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, నందిగాం మండల వైసిపి అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు, ఎంపిటిసి అంబోడి విష్ణు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఎంపిడిఒ శివప్రసాద్, డిటి ధనలక్ష్మి, వైద్యాధికారులు అనిత, సర్పంచ్‌లు బొమ్మాళి గున్నయ్య, తమిరె దేవేంద్ర, కవిటి ఎర్రన్న, సంబాన దానయ్య, ఆశ వర్కర్లు అంగన్వాడి కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వజ్రపు కొత్తూరు: పాతటెక్కలిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, సర్పంచ్ తుంగాన సుశీల, వైసిపి నాయకులు కొల్లి జోగారావు, ఇఒపిఆర్‌డి దిక్కళ తిరుమలరావు, మహిళా సమాఖ్య అధ్యక్షులు జల్లు ఉషారాణి, స్త్రీ వైద్య నిపుణులు ఐశ్వర్య, రాజ్యలక్ష్మి, సుధీర్ కుమార్, ప్రత్యూష, వైద్య సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పోలాకి: బెలమర పాలవలస పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయిడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి చింతు రాఘవరావు, చింతు సింహాచలం, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, కణితి సత్తిబాబు, చింతాడ ఉమ, లండ యర్రయ్య, చింతాడ వెంకటరావు, కె.లక్ష్మణరావు, ఎంపిడిఒ ఉషశ్రీ, డిటి శ్రీనివాసరావు, విఆర్‌ఒ వై.ప్రవీణ్ కుమార్, వైద్యులు రత్నంరాజు, చందనం తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మహాత్మ జ్యోతిభా పూలే గురుకుల పాఠశాల ఆవరణలో తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 320 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒపిఆర్‌డి సింహాచలం, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, వైసిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బండారు జై ప్రతాప్ కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షులు గాడు నాగరాజు, ఉపసర్పంచ్ అనకాపల్లి గోవిందరావు, పంచాయతీ ఇఒ రమేష్, వైద్యాధికారులు సాగరిక, శివశంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో లఖందిడ్డి పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, మండల వైసిపి అధ్యక్షుడు నూక సత్యరాజు, స్థానిక సర్పంచ్ బమ్మిడి గణపతి, ఎంపిపి దుక్క రోజారామకృష్ణ, ఎంపిటిసిలు బొడ్డు అప్పన్న, హనుమంతు గోవిందరావు, వైసిపి నాయకులు పేడాడ వెంకటరావు, సింగుపురం వినోద్, మండల విద్యాశాఖాధికారి ఎల్.వి.ప్రతాప్, అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో జైలుశిక్ష

ప్రజాశక్తి- పొందూరు

మండలం కొంచాడ గ్రామానికి చెందిన ముద్దాడ కృష్ణపై 2020 జనవరిలో హత్యాయత్నానికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన సిడగాన అప్పలనాయుడుకు జైలుశిక్షను ఖరారు చేస్తూ బుధవారం రాజాం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.బాబు తీర్పునిచ్చినట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలు మేరకు 2020 జనవరిలో ముద్దాడ కృష్ణపై అదే గ్రామానికి చెందిన సిడగాన అప్పలనాయుడు కత్తితో దాడి చేశారు. దీనిపై అప్పట్లో పొందూరు ఎస్ఐ దేవానంద్ సిడగాన అప్పలనాయుడు, సిడగాన గోవిందమ్మ, సిడగాన పైడిరాజులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ అనంతరం నేరం నిరూపితం కావడంతో ఏ1 అప్పలనాయుడుకు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.బాబు 5 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.6,500 జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా మెట్ట మల్లేశ్వరరావు, ఉషాకిరణ్ కేసును వాధించినట్లు తెలిపారు.

ప్రభుత్వం కక్షసాధింపు

ప్రజాశక్తి- బూర్జ

యువతీ యువకులు మేల్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైకుంఠపురం, కాలపర్తి మాజీ సర్పంచ్‌లు నానుపాత్రుని సత్యం, బగాది రామ్మూర్తి నాయుడు అన్నారు. బుధవారం వైకుంఠపురం గ్రామంలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నుంచి అక్రమ అరెస్టులతో రాష్ట్రాన్ని అల్లాడిస్తున్నాడని, విద్యార్థులకు ఉద్యోగాలు లేకుండా కంపెనీలను అమ్ముకుంటున్నాడని ఇంటిఇంటికి వెళ్లి యువతీ, యువకులకు అవగాహన కల్పించారు. వైసిపి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు చేపడుతుందన్నారు. రానున్న రోజుల్లో ఈ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ఎంతో అవసరమని, యువతీ, యువకుడు ఆలోచించాల్సి ఉందన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : స్పీకర్

ప్రజాశక్తి- బూర్జ

అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. బుధవారం మండలం నీలాదేవిపురం గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరిస్తూ సమస్యలు తెలుసుకొన్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అక్కడే ఉన్న అధికారుల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి కలిగి ఉండాలని, నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారని, ఆ గ్రామాల్లో డ్రైన్లు వంటి సమస్యలు విషయంలో పరిష్కారానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో సర్కారీ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలోనూ వెల్నెస్ సెంటర్ ఏర్పాటు చేయడం


స్పీకర్‌కు డ్రైనేజీ సమస్య విన్నవిస్తున్న గ్రామస్తులు

జరుగుతోందని, తద్వారా పేద ప్రజలందరికీ నాణ్యమైన సత్వర వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు, టిట్కో డైరెక్టర్ కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపి బొడ్డేపల్లి సూర్యారావు, కరణం కృష్ణం నాయుడు, మండల పార్టీ కన్వీనర్ ఐ.వెంకటరావు, స్థానిక సర్పంచ్ జల్లు సిమ్మమ్మ, ఎంపిటిసి మజ్జి ధనలక్ష్మి, నాయకులు జల్లు ఆదినారాయణ, మజ్జి నర్సింగరావు, లావేటి లక్షుం, కీర్తి శ్రీరాములు, శ్యాం సుందరరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు

విద్యలో రాణించాలి

సోంపేట: అత్యున్నత లక్ష్యసాధన దిశగా, ఉన్నత చదువుల్లో విద్యార్థులు మరింతగా రాణించాలని వక్తలు పిలుపునిచ్చారు. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదవ తరగతిలో 500పైగా మార్కులు సాధించిన ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస మండలాల్లో శ్రీశయన విద్యార్థులను సోంపేటకు చెందిన శ్రీశయన చైతన్య దీపిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విజయదశమి ప్రతిభా పురస్కారాలను సోంపేటలో జరిగిన ప్రధానోత్సవం కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, అతిథులు చేతులు మీదుగా అందజేశారు. సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి సూపరింటిండెంట్ తుంగాన వెంకటేశం, గేదెల వాసుదేవ్, దుద్ది కృష్ణమూర్తి హాజరయ్యారు. దేవాడ మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు ఉన్నత చదువుల్లో చక్కటి ప్రతిభ కనపర్చాలని పిలుపునిచ్చారు. ఉన్నతమైన భవిష్యత్‌కు చదువుల్లో మంచి పట్టుదల, కృషితో ప్రయత్నం చేయాలన్నారు. మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి విభాగాల్లో ఉన్నతస్థాయిలో రాణించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకుని ఉత్తములుగా ఎదిగేందుకు ప్రయత్నం చేయాలన్నారు. చైతన్య దీపిక విద్యార్థులను వివిధ


విద్యార్థులతో స్వచ్ఛంద సంస్థ సభ్యులు

కార్యక్రమాల ద్వారా ప్రోత్సాహం అందిస్తూ విద్యార్థులను మరింత చైతన్యం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో 16 మంది పదవ తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, మెమెంటోలు అందించి అభినందించారు. అలాగే ఈప్రాంతం నుంచి ఎంబిబిఎస్ ఫ్రీ సీట్లు సాధించిన శ్రీశయన విద్యార్థులు అల్లడ నాగరాజు, దుద్ది వర్ధన్, మెండ సిద్దార్థ, దుగానా అభిషేక్, మండల నేహా, దుద్ది జ్యోత్స్నలను జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి దుద్ది వీర్రాజు, ఉపాధ్యక్షులు బీన ఆనంద్, పొడుగు కామేష్, సహ కార్యదర్శి బల్ల జానకిరావు, బల్ల బాబురావు మాస్టర్, బంజు లోకనాథం, దుగాన లోకనాథం, జాక కేశవరావు, బల్ల కాంతారావు, ఆనింగి గంగరాజు, దుద్ది బాలరాజు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆమదాలవలస నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆరోగ్య ఆమదాలవలస నిర్మాణమే తన లక్ష్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో వైద్యశాఖ ఉన్నతాధికారులు, గుత్తేదారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జొన్నవలసలో ఉన్న సిహెచ్‌సి ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని వంశధార ప్రాజెక్టు పూర్వపు కార్యాలయ ఆవరణలోకి సిహెచ్‌సిని తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని తాడివలస, దూసి, బూర్జ, తొగరాం, పొందూరు ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణాల పనులు, వాటి స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు మందకొడిగా జరుగుతున్న తీరుపై స్పీకర్ అసహనం వ్యక్తం చేశారు. ఇదే విధంగా పనులు జరిగితే గుత్తేదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నవంబరు నెలాఖరు నాటికి భవననిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాలని గుత్తేదారులను ఆదేశించారు. భవన నిర్మాణ


వైద్యశాఖ అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ సీతారాం

పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైందని ఇప్పటికైనా పనులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయిన భవనాలను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని, తద్వారా ప్రజలకు అక్కడినుండి సేవలు అందించాలన్నారు. సామాన్య ప్రజానీకానికి వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావడమే సిఎం జగన్మోహన్ రెడ్డి ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, వైద్యులు, గుత్తేదారులు పాల్గొన్నారు.

'భవిష్యత్‌కు గ్యారంటీ'ని విజయవంతం చేయాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

తెలుగుదేశం పార్టీ నవంబర్ 1 నుంచి గ్రామ పంచాయతీ స్థాయిలో చేపడుతున్న భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన టిడిపి శ్రేణులతో మాట్లాడుతూ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం ద్వారా టిడిపి అధికారంలోకి వస్తే ఏయే పథకాలు అమలు చేస్తుందో ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే వైసిపి అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక పాలనను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, ధ్రువీకరణ పత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయిన రమేష్, జీరు భీమారావు, పినకాన అజయ్‌కుమార్, తర్ర రామకృష్ణ, రోణంకి లీలామోహన్, వెలమల కామేశ్వరరావు, గొండు లక్ష్మణరావు, కర్రి అప్పారావు, తంగుడు సునీల్, అచ్యుయ్యరెడ్డి, టెక్కలి, కోటబొమ్మాళి తెలుగు మహిళా విభాగం కార్యకర్తలు దేవాది సింహాద్రి, వాన లక్ష్మి,


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు, అంట్లవరం, మర్రిపాడు, మూలపేట, మేఘవరం, తులగాం, తళ్లవలస, నౌపాడ, రుంకు గ్రామాలకు చెందిన టిడిపి శ్రేణులు, టెక్కలి మండలం బూరగాం, లింగాలవలస, నందిగాం మండలం పెంటూరు, కర్లపూడి, కవిటి అగ్రహారం, నౌగాం, కోటబొమ్మాళి మండలం యలమంచిలి, కిష్టుపురం, బిర్లంగి, శ్యామసుందరపురం, మంచాలపేట, దుప్పిలపాడు, గంగరాం, కొత్తపేట గ్రామాలకు చెందిన నాయకులు అచ్చెన్నాయుడుకు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలు తెలియజేశారు. అలాగే కోటబొమ్మాళి మండల జనసేన నాయకులు అచ్చెన్నాయుడుకు మర్యాదపూర్వకంగా కలిశారు.

వి.జల్లుపుట్టుగలో రోడ్డు వేశారు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

గతుకుల రోడ్డు...ముల్లపొదలు అనే శీర్షిక ఈనెల రెండో తేదీన ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు నాయకులు స్పందించారు. కవిటి మండలం వి.జల్లుపుట్టుగ గ్రామంలో ప్రధాన రహదారి చినుకు పడితే చిత్తడిగా మారుతోందని, వర్షం సమయంలో దమ్ముమడిని తలపించేలా ఉంటున్న రోడ్డుతో స్థానికులు అవస్థలు పడుతున్నట్లు ప్రజాశక్తి వార్త ప్రచురించింది. దీనికి స్పందించిన స్థానిక సర్పంచ్ కిరణ కుమారి, ఎంపిటిసి పూర్ణచంద్రరావు, కవిటి మండల ఎంపిపి కడియాల పద్మప్రకాష్ సహకారంతో మండల పరిషత్ నిధులు రూ.1.50 లక్షలతో సిసి రోడ్డు నిర్మించారు. అంతేకాకుండా సర్పంచ్ ప్రతినిధి జయప్రకాష్ నారాయణ, ఎంపిటిసి పూర్ణచంద్రరావు దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


వి.జల్లుపుట్టుగలో కొత్తగా వేసిన సిసి రోడ్డు

సామాన్యులకు ఇబ్బందులు

సోంపేట: సామాజిక బస్సుయాత్ర పేరుతో గ్రామాల్లోని స్వయంశక్తి మహిళలను, ఉపాధిహామీ కూలీలను భయపెట్టి సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని చెప్పి సభకు కచ్చితంగా హాజరు కావాలని భయపెట్టడంపై టిడిపి శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి శ్రేణులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పరంగా చేస్తున్న కార్యక్రమంలో గొప్పకోసం సామాన్యులను వేధించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్వయంశక్తి సంఘాల్లోని లబ్ధిదారులకు వడ్డీలు మాఫీ చేయమని, సిఎఫ్‌లను అడ్డం పెట్టుకొని గ్రామాల్లో సామాన్యులను సభలకు తరలించి ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. నిజంగా వైసిపి శ్రేణులకు చిత్తశుద్ధి ఉంటే మంత్రులు, నాయకులు వచ్చే సభల్లో ఎటువంటి బెదిరింపులు లేకుండా జన సమీకరణ చేయాలని సవాల్ చేశారు. వైసిపి నాయకులు ఇటువంటి చౌకబారు ఎత్తుగడలు చేయటం ప్రజలు గమనిస్తున్నారన్నారు. దీనిని మండల టిడిపి నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలి

ఎచ్చెర్ల: ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, నాయకులు సి.హెచ్. అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. చిలకపాలెంలో సిపిఎం ప్రజా రక్షణ భేరి పోస్టర్లను, కరపత్రాలను, ప్రజా ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు 2న మందసలో సిపిఎం అఖిల భారత నాయకులు విజూ కృష్ణన్ ప్రారంభించే ఈ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. నవంబరు 3న చిలకపాలెంకు బస్సుయాత్ర వస్తున్న సందర్భంగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతల్లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యాన మూడు బస్సుయాత్రలు ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తూ నవంబర్ 15న విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తోనంగి నందోడు, కోరాడ అప్పన్న పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మోహనరావు

కొత్తూరు: కొత్తూరులో సిపిఎం జిల్లా నాయకులు సిర్ల ప్రసాద్ మండల కేంద్రంలో బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. బస్సుయాత్రను ప్రజలు జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


జయచంద్ర పాత్రోను పరామర్శిస్తున్న శిరీష

పలాస: మండలం కేసుపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రతినిధి జయచంద్ర పాత్రో మాతృమూర్తి, వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి గ్రామానికి చెందిన మల్లా సూర్యం కుమారుడు గుండె పోటుతో మృతి చెందడంతో బుధవారం మృతుల కుటుంబాలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు, మృతుల కుటుంబ సభ్యులు ఉన్నారు.

బెజ్జిపురం మాజీ ఎంపిటిసికి కళా పరామర్శ

లావేరు: మండలంలోని బెజ్జిపురం మాజీ ఎంపిటిసి దన్నాన శ్రీనువాసరావును మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎచ్చెర్ల టిడిపి ఇన్‌ఛార్జి కిమిడి కళావెంకటరావు బుధవారం పరామర్శించారు. శ్రీనువాసరావు తల్లి దన్నాన వరహాలమ్మ ఇటీవల హఠాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న కళావెంకటరావు తన సంతాపాన్ని తెలిపారు. మృతికి గల కారణాలను శ్రీనువాసరావును అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యాదొర, మాజీ జెడ్‌పిటిసి పి. మధుబాబు, గొర్లె లక్ష్మణరావు, మాజీ సర్పంచ్‌లు గొర్లె శ్రీనువాసరావు, కోనేటి శ్రీనువాసరావు ఉన్నారు.


శ్రీనివాసరావును పరామర్శిస్తున్న కళావెంకటరావు

మోహన్‌కు ధర్మాన పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఇటీవల అనారోగ్యానికి గురై గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్న నగర కళింగ కోమటి సంఘం కార్యదర్శి వైశ్యరాజు మోహన్‌ను మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం పరామర్శించారు. ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్న ఆయనను గాజులవీధిలో గల నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోణార్క్ శ్రీను, నగర అధ్యక్షుడు ఉన్న నాగరాజు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శిమ్మ రాజశేఖర్ ఉన్నారు.


మోహన్‌ను పరామర్శిస్తున్న ధర్మాన